క్లుప్తంగా

చిన్నారులకు మంత్రి అభినందనలు



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి సత్యకుమార్

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీవిద్యాధరి ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులను బుధవారం కడప నగరంలోని హరితా హోటల్‌లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అభినందించారు. ఇటీవల గ్వాలియర్‌లో జరిగిన జాతీయస్థాయి హాకీ పోటీలలో విన్నర్స్‌గా నిలిచిన జట్టులో పాఠశాల విద్యార్థి శాంకరి ఉండటంతో ఆ విద్యార్థిని మంత్రి అభినందించారు. జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలలో కుమారస్వామి, దన్విత, రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో మొదటి స్థానం పొందిన చరిత, జాతీయస్థాయి కరాటేలో ద్వితీయ బహుమతి పొందిన దీపిక, సుమిత్రలు ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో పాఠశాల సీఈఓ భానుప్రకాష్, తదితరులు ఉన్నారు.

నవమి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శోభన్‌బాబు

ఎర్రగుంట్ల : శ్రీరామ నవమి పండుగ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ శోభన్‌బాబు తెలిపారు. బుధవారం రంగసాయిపురం గ్రామంలో పట్టణ సీఐ నరేష్‌బాబుతో కలసి ఆ గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ నవమి పండుగ ఉత్సవ వేడుకలలో ఎలాంటి గొడవలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. సీఐ మాట్లాడుతూ పండుగ సందర్భంగా గ్రామంలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా జరుపుకోవాలన్నారు.

పార్టీని మరింత బలపరుస్తాం



పి.రవీంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న మాతంగి సుబ్బరాయుడు

చింతకొమ్మదిన్నె : వైఎస్సార్‌సీపీని మరింత బలపరుస్తామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి మాతంగి సుబ్బరాయుడు తెలిపారు. బుధవారం చింతకొమ్మదిన్నె మండలం ప్రజా ప్రతినిధులు, నాయకులతో ఆయన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డిని కలసి తనను రాష్ట్రస్థాయిలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమించేందుకు కృషి చేసినందుకు సన్మానించారు. కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె మండల ఉపాధ్యక్షుడు జీవీ సుధాకరరెడ్డి, కన్వీనర్ ప్రభాకరరెడ్డి, కమలాపురం వైఎస్సార్‌సీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.శ్రీనివాసరెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు కృష్ణయ్య, మండల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కలమల్ల ఎస్‌ఐగా జయరాములు

ఎర్రగుంట్ల : మండలంలోని కలమల్ల పోలీస్‌స్టేసన్ ఎస్‌ఐగా జయరాములును నియమించినట్లు జిల్లా ఉన్నత పోలీస్ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ తిమోతిని కలసపాడు మండలానికి బదిలీ చేశారు. కడప రిమ్స్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ జయరాములును కలమల్ల ఎస్‌ఐగా బదిలీ చేశారు.

ఉచిత కోచింగ్ అడ్మిషన్లు ప్రారంభం



ఉచిత కోచింగ్ కోసం అడ్మిషన్లు చేయించుకుంటున్న ఉచిత విద్య ఉపాధ్యాయులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక రమణప్ప సత్రంబడి ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి పరీక్షలు రాసిన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పాలీసెట్, ఏపీ ఆర్‌జేసీ ప్రవేశ పరీక్షల కొరకు ఉచిత కోచింగ్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, ఉచిత విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎనర్జీ క్లబ్స్ ఏర్పాటు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ కింద కడప జిల్లాలో ఎనర్జీ క్లబ్ ఏర్పాటు చేసేందుకు 36 పాఠశాలలు ఎంపిక చేశారు. బుధవారం కడప బాలికల హైస్కూల్‌లో ఎనర్జీ క్లబ్స్ ఏర్పాటు చేసి పిల్లలకు సదస్సు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- రక్షణ చర్యలు శూన్యం



చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఫీజు బాక్స్

పులివెందుల రూరల్ : పట్టణంలోని తదితర ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజు బాక్సులు ప్రమాదకరంగా మారాయి. పాత ప్రభుత్వాసుపత్రి సమీపంలో గాంధీనగర్, ఫైర్ స్టేషన్, బొగ్గుడుపల్లె రోడ్డు, అంబకపల్లె రోడ్డు, భాకరాపురం, రోటరీపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజు బాక్స్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. పాత ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఉన్న ఓ ఇంటి వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గోడ ఒక పక్కకు ఒరిగి ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్ కూడా కిందపడే విధంగా ఉంది.

బొగ్గుడుపల్లె రోడ్డు సమీపంలోని మిస్సమ్మ బంగ్లా ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు బాక్సులు కూడా చేతికందేంత ఎత్తులో ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆ ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్రహరీ గోడ లేకపోవడంతో మూగజీవాలు వెళుతుటాయని వారు వాపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు బాక్సుల వద్ద రక్షణ చర్యలు చేపట్టలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రమాదకరంగా ఉన్నాయి



పట్టణంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ప్రహరీ గోడ లేక ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రహరీ లేకపోవడంతో మూగజీవాలు ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్తున్నాయి. ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి. లేకపోతే ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది.

– మాధవాచారి, స్థానికుడు, పులివెందుల

క్షణ క్షణం.. భయం భయం



చాలా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల కింద ఏర్పాటు చేసిన దిమ్మెలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల కింద ఏర్పాటు చేసిన దిమ్మెలు నెర్రలు చీలి బండలు కూడా పగిలిపోయి ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– సుబ్బరాయుడు, స్థానికుడు, పులివెందుల



నెర్రలు చీలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె



ప్రమాదకరంగా ఉన్న ఫీజుల బాక్స్

నేటి నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

కమలాపురం : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3, 4 తేదీల్లో చిన్నచెప్పలి, ఎర్రగుడిపాడు గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. 5వ తేదీ పెద్దచెప్పలి, నల్లింగాయపల్లెలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే 8వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు కమలాపురం-1, కమలాపురం-2, పందిళ్లపల్లె, జంభాపురం గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

పులివెందుల టౌన్ : పట్టణంలోని వైఎస్‌వీఆర్‌ఎం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 2025–26 సంవత్సరానికి గానూ ఈనెల 7వ తేదీ నుంచి అడ్మిషన్లు స్వీకరించబడుతాయని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణేష్ తెలిపారు. పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు కళాశాల ఆఫీస్ సిబ్బందిని సంప్రదించి అప్లికేషన్ తీసుకుని పూరించి కళాశాల ఆఫీస్‌లో ఇచ్చి అడ్మిషన్ పొందాలన్నారు. తమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంబైపీసీ ఇంగ్లీషు మీడియం, తెలుగు మీడియంలలో విద్యా బోధన ఉంటుందన్నారు. ఈ ఏడాది నుండి మొదటి సంవత్సరం విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం విద్యా బోధన ఉంటుందన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే జైలుకే



మైనర్ బాలురకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్ఐ

కమలాపురం : మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలో ఎలాంటి పత్రాలు, లైసెన్స్‌లు లేకుండా బైక్‌లు నడుపుతున్న మైనర్లను పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండని తమ పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దన్నారు. అలా మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. రాత్రి 10 గంటల తర్వాత అకారణంగా రోడ్లపై తిరిగితే చర్యలు తప్పవన్నారు. మద్యం, గంజాయి సేవించి వాహనాలు నడిపితే జైలుకు పంపిస్తామన్నారు. ముఖ్యంగా గంజాయి కొన్నా, విక్రయించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనల మేరకే వాహనాలు నడపాలన్నారు. ఇది ఫస్ట్ టైం కాబట్టి కౌన్సిలింగ్ ఇచ్చి వదిలిపెడుతున్నామని, మరో సారి ఇలా జరిగితే కచ్చితంగా జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. అనంతరం మైనర్ బాలుర తల్లిదండ్రులతో సంతకాలు తీసుకుని వారిని విడిచిపెట్టారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరి చేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

సింహాద్రిపురం : స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌లో బుధవారం ఎంపీడీఓ కృష్ణమూర్తి అధ్యక్షతన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు పరిసరాల పరిశుభ్రతపై శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలకు ఏ రోగాలు దరిచేరవన్నారు. గ్రామాల పరిశుభ్రత కొరకు ప్రజా ప్రతినిధులతోపాటు ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జయభారతి, పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు, అన్ని గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టె నిర్మాణానికి భూమిపూజ



నీటి తొట్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ కుళ్లాయిబాబు

లింగాల : లింగాల గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పథక టెక్నికల్ అసిస్టెంట్లు సత్యానందరెడ్డి, పీటర్, ఫీల్డ్ అసిస్టెంట్ రవితేజలు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలంలో పశువులు నీటిని తాగేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా నీటి తొట్లు మంజూరయ్యాయని, అందులో భాగంగా లింగాలలో నీటి తొట్టె నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని తాడిగొట్ల గ్రామ పంచాయతీలో బుధవారం ఎంపీడీఓ కుల్లాయిబాబు పర్యటిస్తూ ఉపాధి హామీ నిధుల ద్వారా పశువులకు నీటితొట్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో రామాంజనేయులురెడ్డి, ఉపాధి సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 4న ప్రభుత్వ మహిళా కళాశాల వార్షికోత్సవం

కడప ఎడ్యుకేషన్: పట్టణంలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏప్రిల్ 4వ తేదీన కళాశాల వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలను స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు స్టూడెంట్ యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్య అతిథిగా కడప జిల్లా ఎస్పీ శ్రీ ఈజీ.అశోక్‌కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ హాజరవుతారని తెలిపారు. అత్యధిక మార్కులతో ప్రతిభ చూపిన విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీలో ఉత్తమ సేవలందించిన వారికి జ్ఞాపిక, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు.

పాస్టర్ మృతికి సంతాపంగా క్రొవ్వొత్తుల ప్రదర్శన

కడప కార్పొరేషన్: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతికి సంతాపంగా క్రిష్టియన్ మైనార్టీలు బుధవారం క్రొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక కాంగ్రిగేషనల్ టౌన్ చర్చిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ మోహన్‌బాబు మాట్లాడుతూ మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల కడప వాసి కావడం గర్వకారణమన్నారు. ఆయన కుటుంబానికి ఆదరణ కలగాలని దేవుని ప్రార్థించారు. ప్రభుత్వం కేసులోని వాస్తవాలను వెలికితీసి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సంఘ సెక్రటరీ విజయుడు, నోవా బెన్ని, ఆశీర్వాదమ్మ, సుశీలమ్మ, రాజమనోహర్, ప్రసన్న కుమార్, పులి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



పులివెందులలో డ్రాయింగ్ మాస్టర్ గోపాల్‌రావు దంపతులను సత్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



సింహాద్రిపురంలో ఈఓపీఆర్డీ పద్మనాభరెడ్డిని సత్కరిస్తున్న ఎంపీడీఓ, తదితరులు



లింగాలలో అటెండర్ షరీఫ్ దంపతులను సత్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తదితరులు

పులివెందుల టౌన్ : ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని పాఠశాల హెడ్మాస్టర్ గంగిరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్ ఎన్.ఎన్. గోపాల్‌రావు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం డ్రాయింగ్ మాస్టర్ గోపాల్‌రావు విద్యార్థినులపై ఎంతో చక్కగా వ్యవహరిస్తూ విద్యనందించారన్నారు. అనంతరం రవీంద్రనాథ హైస్కూలు, తదితర పాఠశాలల ఉపాధ్యాయులు ఆయన సేవలను కొనియాడారు.

సింహాద్రిపురంలో

సింహాద్రిపురం : ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న పద్మనాభరెడ్డి పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. దంపతులను ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాసులరెడ్డి, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, రిటైర్డు హెచ్‌ఎంలు, వైఎస్ఆర్‌టీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సర్వసాధారణమని పాఠశాల హెడ్మాస్టర్ సాతుపాటి ప్రసాద్ తెలిపారు. బుధవారం లింగాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న అటెండర్ షరీఫ్‌కు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాల హెడ్మాస్టర్ మాట్లాడుతూ పాఠశాలకు షరీఫ్ చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ట



నూతన శ్రీ వీరభద్రస్వామి ఆలయం

కొండాపురం : మండలంలోని పెంజిఅనంతపురం సమీపంలోని నీలమల్లేశ్వరస్వామి కోన దేవస్థానం నందు నూతనంగా నిర్మించిన శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు, ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు హోమం, మహామంగల హారతి, అభిషేకం పూజలు చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

నేడు వాహనాల వేలం

కడప వైఎస్ఆర్ సర్కిల్: అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు తమ కార్యాలయ ఆవరణలో జరుగుతుందన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలోనే సాగు చేయండి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏపీ కార్ల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్

పులివెందుల రూరల్ : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలోనే పంటలను సాగు చేయాలని ఏపీ కార్ల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఏపీ కార్ల్‌లో ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్ ప్రణాళికలో భాగంగా గ్రామసభ ఏ విధంగా చేయాలన్నది నాటక రూపంలో చేసి చూపించడం జరిగిందన్నారు. సంఘం యొక్క సభ్యుల డేటా ఏ విధంగా తీసుకోవాలన్నది ఒక నాటక రూపంలో చేసి చూపించామన్నారు. అలాగే రైతులు యొక్క డేటాను ఆన్‌లైన్ ద్వారా ఏ విధంగా సేకరించాలన్నది స్క్రీన్ పైన చేసి అవగాహన కల్పించామన్నారు. బీడు భూములలో నవధాన్యాలను వేసుకుని వాటిని 60 రోజులకు భూమిలోకి తీసుకోవడంవల్ల భూమి సారవంతమై కార్బన్ శాతం పెరిగి భూమిలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది మంచి పంటలు వస్తాయన్నారు. అనంతరం రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు కూడా ఎలాంటి రసాయనిక మందులను వాడకుండా ప్రకృతి పరంగా దొరికే ఆవు పేడ, మూత్రంతో జీవామృతం తయారు చేసుకుని పంటలకు అందించాలన్నారు. రసాయన రహిత ఆంధ్రప్రదేశ్‌గా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం వసంతకుమారి, ఎస్ఎఫ్ఏ చంద్రమౌళీశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలి

ఎర్రగుంట్ల : మండలంలోని ప్రభుత్వ చౌక దుకాణాల ద్వారా ఎండీయూ వాహన ఆపరేటర్లు ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాల్సిందే అని తహసీల్దార్ శోభన్‌బాబు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 37 ప్రభుత్వ చౌక దుకాణాలు ఉన్నాయని, 12 ఎండీయూ వాహనాలు ఉన్నాయన్నారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఇంటింటికి రేషన్ పంపిణీ చేయని ఎండీయూ ఆపరేటర్లకు జీతం నిలుపుదల చేస్తామన్నారు. వాహనం చెడిపోతే మరో వాహనంతో పంపిణీ చేయాలని ప్రతి రేషన్ కార్డుదారుడికి రేషన్ అందించాలన్నారు. దీనిపై ఈనెల నుంచి ప్రతి రోజు ఆర్ఐ పర్యవేక్షణ చేస్తారన్నారు.

జేఈఈ పరీక్షల సందడి

కడప ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్ పరీక్షలు ఏప్రిల్ 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి కనిపించింది. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు.. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆరు గంటల వరకు పరీక్ష నిర్వహించారు. నగర శివారులోని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ చివరి విడత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇందులో ఉదయం సెషన్‌కు సంబంధించి 109 మంది విద్యార్థులకు గానూ 92 మంది హాజరుకాగా 17 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం సెక్షన్లో 109 గాను 102 మంది హాజరు కాగా 7 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు అక్కడక్కడా లోపలికి పంపాలంటూ సిబ్బందిని బ్రతిమలాడడం కనిపించింది. బంగారు ఆభరణాలు ధరించి వచ్చిన వారిని అనుమతించకపోవడంతో విద్యార్థులను తమ తల్లిదండ్రులకు అక్కడే ఆభరణాలు తీసి ఇచ్చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసుల సహ కారంతో బుధవారం తనిఖీలు నిర్వహించారు.దీంతో పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

సాక్షి ఫొటోగ్రాఫర్



కేఓఆర్‌ఎం కళాశాల వద్ద చెవుల కమ్మలను తీస్తున్న విద్యార్థిని



పరీక్షకు ఆలస్యంగా రావడంతో సిబ్బందిని బ్రతిమాలుతున్న విద్యార్థులు



తల్లికి తన బంగారు ఆభరణాలు ఇస్తున్న విద్యార్థిని



విద్యార్థుల హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది



కష్టపడి చదివా.. పంపండి సారూ..



సార్ ... మమ్మల్ని పంపండి ప్లీజ్